నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, శనివారం 17 మే 2025 | SANGAREDDY

తాగునీటి కోసం మహిళల నిరసన

దుబ్బాక మండలం తిమ్మాపూర్‌లో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

దుబ్బాక, మే 16: సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం తిమ్మాపూర్‌లో తాగునీటి సమస్య పరిష్కరించాలంటూ మహిళలు శుక్రవారం ఖాళీ బిందెలతో నిరసనకు దిగారు. పది రోజులుగా తాగునీటి సమస్యతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా చేయకపోవడంతో పాటు గ్రామంలో బోరుమోటర్లు మరమ్మతులు చేపట్టకపోవడంతో నీటి ఎద్దడి నెలకొంది. నీటి సమస్యను పరిష్కరించాలని కార్యదర్శికి, సంబంధిత అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోవడంతో చేసేదేమిలేక మహిళలు ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. సిద్దిపేట-రామాయంపేట జాతీయ రహదారిపై నిరసనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. సుమారు గంట కుపైగా రాస్తారోకో చేపట్టడంతో భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న దుబ్బాక ఎస్సై గంగరాజు సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. మహిళలతో మాట్లాడినా ఫలితం లేకపోవడంతో ఎంపీడీవో భాస్కర శర్మ , మిషన్ భగీరథ అధికారులు గ్రామానికి చేరుకొని నీటి సమస్య పరిష్కారానికి హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. గ్రామంలో మిషన్ భగీరథ పైపులైన్ ధ్వంసం కావడంతో పాటు బోరు మోటర్లు పాడైపోవడంతో సమస్య తలెత్తిందని ఎంపీడీవో తెలిపారు. శుక్రవారం రాత్రి వరకు మిషన్ భగీరథ పైపులైన్, బోరు మోటర్లు మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరిస్తామన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొంటాం

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

కొండాపూర్, మే 16: తడిసిన ప్రతి ధాన్యం గింజనూ కొంటామని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. శుక్రవారం కొండాపూర్‌లోని సొసైటీ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బందులు కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతులు అధైర్యపడవద్దని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు. అనంతరం తహసీల్ కార్యాలయంలో భూభారతిలో భాగంగా నిర్వహిస్తున్న డాటా ఎంట్రీ రికార్డులను కలెక్టర్ పరిశీలించారు. ఎలాంటి పనులు ఉన్నా ప్రజలు, రైతుల సమస్యలు పరిష్కరించాలని సూచించారు. రైతుల భూసమస్యల పరిష్కారానికే భూభారతి చట్టాన్ని ప్రభుత్వం అమలులోని తీసుకువచ్చిందన్నారు. ఆర్డీవో రవీందర్‌రెడ్డి, ఏడీఏ వెంకటలక్ష్మి, తహసీల్దార్ అశోక్, డిప్యూటీ తహసీల్దార్లు మర్రి ప్రదీప్, మల్లేశం, ఆర్ఐలు మల్లం రాజు, రామచందర్, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, మాజీ ఎంపీటీసీ నర్సింహారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మాణిక్‌రెడ్డి, సొసైటీ కార్యదర్శి సీరాజ్, మండల వ్యవసాయాధికారి గణేశ్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

సిద్దిపేట రూరల్ మండలం రాంపూర్‌లో మూలకుపడిన వాటర్ ట్యాంకర్

ఎన్సాన్‌పల్లిలో మురుగుకాల్వలో పేరుకుపోయిన చెత్త

తొగుట మండలం ఘనపురంలో బస్టాండ్‌లోనే సామగ్రి

పల్లె.. పరేషాన్!

సమస్యల వలయంలో గ్రామాలు.. కాంగ్రెస్ ప్రభుత్వంలో నిధుల కటకట

- బీఆర్ఎస్ హయాంలో అవార్డుల పంట
- ఏడాదిన్నర దాటినా కొలువుదీరని పాలకవర్గాలు
- పాలక వర్గాలు లేక పల్లెలకు నిధులు, గ్రాంట్లు బంద్
- పేరుకే ప్రత్యేకాధికారులు... భారమంతా పంచాయతీ కార్యదర్శులపైనే
- ఉమ్మడి మెదక్ జిల్లాలో 1615 గ్రామ పంచాయతీలు

తొగుట మండలం ఘనపురంలో మూలనపడిన చెత్తరిక్షాలు

సిద్దిపేట రూరల్ మండలం చిన్నగుండెవెళ్లిలో పల్లెప్రకృతి వనంలో ఎండిపోతున్న మొక్కలు

తడకపల్లిలో హరితహారం చెట్లను కొట్టేసిన అధికారులు

సిద్దిపేట, మే 16(నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ పాలనలో గ్రామసీమలు సమస్యలతో సతమతమవుతున్నాయి. నిధులు రాక, పాలకవర్గాలు లేక గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి కుంటుపడింది. పాలన అస్తవ్యస్తంగా సాగుతున్నది. ప్రత్యేకాధికారులు పాలనలో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. గ్రామాలకు నియమించిన ప్రత్యేకాధికారులు ఆ గ్రామాల వైపు కన్నెత్తి చూడడం లేదు. పూర్తి భారం పంచాయతీ కార్యదర్శులపైనే పడుతున్నది. ప్రభుత్వం నుంచి రూపాయి నిధులు రాకపోవడంతో సమస్యలను గ్రామ పంచాయతీ కార్యదర్శులు పరిష్కరించలేక పోతున్నారు. దీంతో వారిని గ్రామస్తులు తిట్టి పోస్తున్నారు. దీనిని భరించలేక పంచాయతీ కార్యదర్శులు కొందరు అప్పులు చేసి పలు పనులు చేపట్టారు. వాటికి సంబంధించి బిల్లులు రాక పంచాయతీ కార్యదర్శులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీ కార్యదర్శులపై ఉన్నతాధికారుల ఒత్తిళ్లు పెరిగాయి. ఎంపీవో, ఎంపీడీవో, డీఎల్‌పీవోల వేధింపులు రోజురోజుకూ తీవ్రం అవుతున్నాయని కార్యదర్శులు ఆరోపిస్తున్నారు. ఫీల్డ్‌కు అధికారులు వచ్చారంటే ఎంతోకొంత సమర్పించుకోకపోతే తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

పంచాయతీ కార్యదర్శుల ఆవేదన

ప్రభుత్వం నుంచి నిధులు రాక చిన్న చిన్న సమస్యలను పరిష్కరించలేక పోతున్నామని గ్రామ పంచాయతీల కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలను శుభ్రం చేసే పారిశుధ్య కార్మికులకు వేతనాలు సమయానికి రాక పస్తులు ఉంటున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిధులను ఆపేసింది. పాలక వర్గాలు లేక పోవడంతో గ్రామాలకు కేంద్ర ప్రభుత్వ నిధులు, గ్రాంట్లు జీపీలకు రావడం లేదు. కేవలం పన్నుల ద్వారా వచ్చిన ఆదాయంతోనే నెట్టుకొస్తున్నారు. సిద్దిపేట జిల్లాలో 499, మెదక్ జిల్లాలో 469, సంగారెడ్డి జిల్లాలో 647 గ్రామ పంచాయతీలు, ఉమ్మడి మెదక్ జిల్లాలో 1615 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇటీవల నూతన గ్రామ పంచాయతీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సిద్దిపేట జిల్లాలో 508 పంచాయతీలు, 4508 వార్డులు, మెదక్ జిల్లాలో 492 పంచాయతీలు 4220 వార్డులు, సంగారెడ్డి జిల్లాలో 633 పంచాయతీలు, 5558 వార్డులు ఉన్నాయి). బీఆర్ఎస్ హయాంలో ప్రతినెలా పల్లె ప్రగతి నిధులు విడుదల చేయడంతో పల్లెలు కళకళలాడాయి. ప్రస్తుతం పల్లెలు కళావిహీనంగా మారాయి. ఇంటింటా చెత్త సేకరణ, హరితహారం చెట్లకు నీరు పెట్టడం కోసం ట్రాక్టర్లలో డీజిల్ పోయడానికి నిధులు లేక ఆ ట్రాక్టర్లను మూలనపడేయగా, హరితహారంలో నాటిన మొక్కలు పూర్తిగా ఎండిపోయాయి. నర్సరీలు ఆనవాళ్లు లేకుండా పోతున్నాయి. గ్రామాలు చెత్తాచెదారంతో నిండి కంపుకొడుతున్నాయి.

నాడు ఉత్తమ గ్రామాలు

బీఆర్ఎస్ హయాంలో ఉమ్మడి మెదక్ జిల్లాలోని గ్రామాలు పల్లెప్రగతి ద్వారా అద్భుత ప్రగతి సాధించాయి. జిల్లాలోని అన్ని గ్రామాలు పరోగతి దశలో ఉండేవి. బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ అమలు చేసి గ్రామాలను అభివృద్ధి చేసింది. పల్లె ప్రగతిలో ఎన్నో కార్యక్రమాలను చేపట్టింది. ప్రతి నెలా గ్రామాలకు నిధులు అందించింది. ఉమ్మడి మెదక్ జిల్లాకు ప్రతినెలా రూ.30 కోట్ల పైచిలుకు నిధులు వచ్చాయి. ఈ నిధులతో గ్రామాలను అద్భుతంగా తీర్చిదిద్దారు. పల్లె ప్రగతి కింద ముమ్మరంగా పనులు చేపట్టారు. ఫలితంగా గ్రామాలు స్వచ్ఛంగా, ఆహ్లాదంగా మారాయి. ఆరోగ్య గ్రామాలుగా ఫరిఢవిల్లాయి. ప్రతి ఊరికి డంపింగ్ యార్డు, హరితహారంలో విరివిగా మొక్కలు నాటించారు. ప్రతి గ్రామ పంచాయతీకి ట్రాక్టర్‌ను కొనిచ్చారు. తాగునీటి సమస్య లేకుండా ప్రతి ఇంటికీ నల్లా ద్వారా మిషన్ భగీరథ నీటిని అందించారు. పల్లెప్రకృతి వనాలు, డంపింగ్ యార్డులు, వైకుంఠధామాలు ఏర్పాటు చేశారు. దీంతో జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఉమ్మడి మెదక్ జిల్లాలోని అనేక గ్రామాలకు అవార్డులు వరించాయి. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో గ్రామాల పరిస్థితి తారుమారైంది.

ఎన్సాన్‌పల్లిలో ఎక్కడి చెత్త అక్కడే

సిద్దిపేట రూరల్ మండలం బుస్సాపూర్‌లో మురుగు కాలువ దుస్థితి

సిద్దిపేట రూరల్ మండలం వెంకటాపూర్‌లో డ్రైనేజీ దుస్థితి

సిద్దిపేట రూరల్ మండలం రాంపూర్‌లో పల్లెప్రకృతి వనం దుస్థితి

సిద్దిపేట రూరల్ మండలం చిన్నగుండెవెళ్లి రోడ్డు పక్కనే చెత్త

సిద్దిపేట రూరల్ మండలం వెంకటాపూర్‌లో నిరుపయోగంగా పంచాయతీ ట్రాక్టర్

కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు

విద్యార్థులను అభినందిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయుడు తిగుళ్ల సుధాకర శర్మ

- విశ్రాంత ఉపాధ్యాయుడు తిగుళ్ల సుధాకర శర్మ

మద్దూరు(ధూళిమిట్ట), మే 16: విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తు కోసం కష్టపడి చదవాలని విశ్రాంత ఉపాధ్యాయుడు తిగుళ్ల సుధాకర శర్మ అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట పంచాయతీ కార్యాలయ ఆవరణలో హైస్కూల్ హెచ్ఎం కరుణాకర్‌రెడ్డి అధ్యక్షతన టీచర్స్, పేరెంట్స్ మీటింగ్ ఏర్పాటు చేశారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన వైష్ణవి, నిహారిక, రిషివర్ధన్‌లను సుధాకర శర్మ పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు మంచిగా చదువుకొని తల్లిదండ్రులు, గురువులతో పాటు పుట్టిన ఊరికి పేరుప్రతిష్టలు తీసుకురావాలన్నారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా వినడంతో పాటు క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. ధూళిమిట్ట హైస్కూల్ వందశాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాలో మూడో స్థానంలో నిలబడడం సంతోషకరమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన, నాణ్యమైన విద్య అందుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దుబ్బుడు దీపికావేణుగోపాల్‌రెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు స్వర్గం లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శి సిద్దేశ్వర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ నాచగోని పావనీలక్ష్మి, వీవో హరిబాబు, రేషన్ డీలర్ రమేశ్, డీడీఎఫ్ సభ్యుడు రాజు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓయూ పీజీకి మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

- సిద్దిపేట కళాశాలను సందర్శించిన విశ్వవిద్యాలయం ఉపకులపతి

పీజీ కళాశాలలో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఓయూ బృందం

సిద్దిపేట టౌన్, మే 16: విద్యార్థుల అవసరాల దృష్ట్యా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఉస్మానియ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం స్పష్టం చేశారు. సిద్దిపేట ఓయూ పీజీ కళాశాలను శుక్రవారం ఓయూ ప్రతినిధి బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ప్రతినిధులు కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులతో మాట్లాడి సమస్యలు, బోధన తదితర వాటిపై ఆరా తీశారు. అనంతరం ఉపకులపతి మాట్లాడుతూ..విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి పెంపొందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. కళాశాలలో ఎమ్మెస్సీ డాటా సైన్స్ కోర్సును ఈ ఏడాది నుంచే ప్రారంభిస్తున్నామని, డిమాండ్ దృష్ట్యా ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ కోర్సుల్లో సీట్ల సంఖ్య పెంపునకు కృషి చేస్తామన్నారు. బోధనేతర సిబ్బంది వేతనాల పెంపునకు ప్రత్యేక చొరవ తీసుకొని పరిష్కరిస్తామన్నారు. అంతకు ముందు ఓయూ ప్రతినిధి బృందం కలెక్టర్ మనుచౌదరిని మర్యాదపూర్వకంగా కలిసింది. కళాశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి పలు ప్రతిపాదనలను బృందం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లింది. ప్రధాన రహదారి మెయిన్ ఎంట్రెన్స్ గేట్ నుంచి కళాశాల ప్రాంగణంలోని బాయ్స్ హాస్టల్ వరకు రోడ్డు వేయిస్తామని, వీధి దీపాలు, తాగునీటి సౌకర్యం కోసం ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు నరేశ్‌రెడ్డి, జితేందర్ కుమార్‌నాయక్, రాజేంద్రనాయక్, రాజశేఖర్‌రెడ్డి, జిల్లా కళాశాల సమన్వయకర్త రవినాథ్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రంలో మోసంపై రైతుల కన్నెర్ర

- ఐకేపీ సిబ్బంది తీరుపై డీఆర్డీవో పీడీ ఆగ్రహం
- ఏపీఎం, వీవోఏలకు నోటీసులు ఇస్తాం
- ధాన్యం తూకంలో బయటపడ్డ మోసం
- రెండు యంత్రాలను సీజ్ చేసిన తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్

కాంటాలు సీజ్ చేసిన తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్

జిన్నారం, మే 16: పంట పండించడం కంటే అమ్ముకోవడానికి రైతు ఎక్కువ కష్టపడాల్సి వస్తోంది. ఆరు కాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని అష్టకష్టాలు పడి విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. కొనుగోలు కేంద్రాల్లో అంతా దగా నడుస్తోందని, నిర్వాహకులు మోసం చేస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. సంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ మాధురి ఆదేశాల మేరకు శుక్రవారం డీఆర్డీవో పీడీ జ్యోతి మండలకేంద్రంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసి ధాన్యాన్ని పరిశీలించారు. అకాల వర్షాలకు తడిసి ముద్దయి ఆరబెట్టిన ధాన్యాన్ని మాయిశ్చర్ మిషన్‌తో పరిశీలించి రైతుల గోడు తెలుసుకున్నారు. సకాలంలో కాంట వేయడం లేదని, టోకెన్ల ప్రకారం కొనుగోలు చేపట్టడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తూకంలో మోసాలు జరుగుతున్నాయంటూ విన్నవించారు. తూకంలో క్వింటాల్‌కు ఏడు కిలోల చొప్పున మోసాలకు పాల్పడుతున్నారని అధికారి వద్ద రైతులు బోరున విలపించారు. గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, హమాలీల కొరతతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. 15 రోజులుగా కేంద్రం వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొందని ఓ మహిళా రైతు పీడీ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. చేతికి వచ్చిన పంటను విక్రయించే వరకు ప్రతి సందర్భంలో అన్నదాత దోపిడీకి గురవుతున్నాడని రైతు నాయకుడు పుట్టి భాస్కర్ డీఆర్డీవో పీడీకి వివరించారు. పెట్టిన పెట్టుబడి, శారీరక శ్రమ అన్నీ వృథా అవుతున్నాయని, దేశానికి అన్నం పెట్టే రైతన్న చివరికి తినడానికి తిండి కూడా కొనుక్కోలేని దౌర్భాగ్య స్థితిలో ఉన్నాడని వాపోయారు. కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న మోసంపై తగిన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని రైతులతో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్పందించిన డీఆర్డీవో పీడీ నిర్వాహకుల తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. రైతులకు అందిస్తున్న సౌకర్యాలపై ప్రశ్నించారు. కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యాన్ని గుర్తించి బాధ్యులైన ఏపీఎం నరేందర్, వీవోఏ లతకు షోకాజ్ నోటీసులు అందిస్తామన్నారు. కేంద్రంలో ధాన్యాన్ని సకాలంలో తూకం వేసి మిల్లులకు తరలించాలని సిబ్బందిని ఆదేశించారు. కేంద్రం వద్దకు లారీలు పంపించాలని డీఎస్‌వోను కోరారు.

తనిఖీ చేసిన తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ తనిఖీ చేశారు. కేంద్రంలో జరుగుతున్న మోసాలపై ఆరా తీశారు. తూకం వేసే సమయంలో క్వింటాల్‌కు దాదాపు 4 కిలోల చొప్పున మోసాలకు పాల్పడుతున్నారని స్వయంగా తూకం వేసి నిర్ధారించారు. రెండు తూకం యంత్రాలను సీజ్ చేశారు. రైతులను మోసాలకు గురిచేస్తున్న కేంద్రం నిర్వాహకులపై కేసు నమోదు చేసి కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామన్నారు. ధాన్యం విక్రయాలు చేసిన రైతులకు పరిహారం అందించేలా కృషి చేస్తామన్నారు. స్పందించిన అధికారుల తీరుపై ఆయా గ్రామాల రైతులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఈవో అజారుద్దీన్, ఐకేపీ సిబ్బంది, రైతులు ఉన్నారు.

నాసిరకంగా సింగూరు కెనాల్ పనులు

- అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ చేయితో కదిపితే విరిగిపోయిన టెంప్లెట్ (సిమెంట్ దిమ్మె)

పుల్కల్, మే 16: సింగూరు ఎడమ కాలువ పనులు నాసిరకంగా సాగుతున్నాయని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బస్వాపూర్ మోడల్ స్కూల్ సమీపం నుంచి వెళ్లిన(ఎల్ఎంసీ)లెఫ్ట్ మెయిన్ కెనాల్ సీసీలైన్ పనులను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా క్రాంతికిరణ్ మాట్లాడుతూ.. ఇంకో ఐదేండ్లయినా కెనాల్ సీసీ లైన్ పనులు పూర్తయ్యేలా కనిపించడం లేదన్నారు. జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ కెనాల్ పనులపై దృష్టి సారించి త్వరగతిన పూర్తయ్యేలా ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. పనులు ప్రారంభించి తొమ్మిది నెలలు గడుస్తుందన్నారు. ఇప్పటికే రెండు పంటలకు సాగు నీరందక రైతులు పంట నష్టపోయారన్నారు. ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నాసిరకంగా పనులు చేపడుతున్నారన్నారు. బీఆర్ఎస్ హయాంలో మాజీ మంత్రి హరీశ్‌రావు చొరవతో పెండింగ్‌లో ఉన్న కెనాల్ పనులను వెంటపడి మరీ పూర్తి చేయించి చెరువులు నింపామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కనీసం రైతులకు సాగు నీరందించేందుకు దిక్కులేదన్నారు. కెనాల్‌లో సైడ్‌కు వేసిన టెంప్లెట్ (సిమెంట్ దిమ్మెలు) నాసిరకంగా వేయడంతో పట్టుకోగానే విరిగిపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కాలువ పనులు నాణ్యతతో చేపట్టాలని, లేనిపక్షంలో పనులను అడ్డుకొని తీరుతామని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ హెచ్చరించారు. అనంతరం సీసీ పనులపై ఇరిగేషన్ శాఖ డీఈతో ఫోన్‌లో మాట్లాడి పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మాచర్ల విజయ్‌కుమార్, శ్రీనివాస్ చారి, మఠం సిద్దన్న, మహేశ్‌బాబు, మల్లారెడ్డి, రాజారామ్, ప్రభాకర్ ఉన్నారు.

రూప్లాతండాలో చికున్‌గున్యా

- పలువురికి అస్వస్థత
- సర్వే నిర్వహించి, వైద్యశిబిరం ఏర్పాటు చేసిన అధికారులు

రూప్లాతండాలో ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహిస్తున్న అధికారులు, వైద్య సిబ్బంది

సిర్గాపూర్, మే 16: సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలంలోని రూప్లాతండాలో చికున్‌గున్యాతో పలువురు అస్వస్థతకు గరుయ్యారు. నారాయణ ఖేడ్, బీదర్ తదితర దవాఖానల్లో చికిత్స పొందుతున్నట్లు గ్రామస్తులు చెప్పారు. రెండు వారాల నుంచి జ్వరం, కాళ్ల నొప్పులు, తలనొప్పి, జలుబుతో దాదాపు 20 మందికి పైగా బాధపడుతున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ విషయాన్ని అధికారులకు తెలుపడంతో సిర్గాపూర్ ఎంపీవో బ్రహ్మం, పంచాయతీ కార్యదర్శి గౌతం శుక్రవారం గ్రామంలో ఇంటింటికి తిరిగి సర్వే చేశారు. ఇక్కడ 58 ఇండ్లు ఉండగా, 25 ఇండ్లకు వెళ్లి వైద్య సిబ్బంది సర్వే చేశారు. కొందరు సాధారణ జలుబు, జ్వరంతో ఉన్నట్లు గుర్తించామన్నారు. అనంతరం గ్రామ పంచాయతీలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి పరీక్షలు చేశారు. ఇందులో ఏఎన్ఎంలు సుజాత, శ్రీలత, ఆశ వర్కర్ సిబ్బంది ఉన్నారు. ఈ సందర్భంగా కంగ్టి మెడికల్ ఆఫీసర్ నాగమణి మాట్లాడుతూ.. రూప్లాతండాలో ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించామన్నారు. వైరల్ ఫీవర్ కాదని, తొమ్మిది మంది అస్వస్థతకు గురయ్యారన్నారు. ఇందులో నలుగురికి జాయింట్ పేయిన్స్, మరో ఐదుగురికి సాధారణ జ్వరం ఉందన్నారు. వీరి రక్త నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపిస్తున్నామన్నారు. చికున్‌గున్యా వ్యాధి ఇంకా నిర్ధారణ కాలేదని, ప్రజలెవ్వరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు.

అంత్యక్రియలకు ఒప్పుకోని అద్దె ఇంటి యజమాని

ఈనెల 11 నుంచి వైకుంఠధామంలో తలదాచుకున్న కుటుంబం

బాధితుడు సంతోష్ కుటుంబానికి సహాయం చేస్తున్న ఆర్యవైశ్య సంఘాల నాయకులు

సిద్దిపేట, మే 16: మనిషి చనిపోతే కనీసం ఇంట్లోకి రానివ్వకుండా అమానవీయంగా ప్రవర్తించిన దారుణ సంఘటన సిద్దిపేటలో చోటుచేసుకుంది. తండ్రి చనిపోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న కొడుకు కుటుంబానికి చేదు అనుభవం ఎదురైంది. అద్దె ఇంట్లో అంత్యక్రియలు చేపట్టేందుకు, నివాసంలో ఉండేందుకు ఇంటి యజమాని అనుమతించక పోవడంతో వైకుంఠధామంలో తలదాచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వివరాల్లోకి వెళితే... కామారెడ్డి జిల్లా ఘనపూర్‌కు చెందిన సంతోష్ బతుకుదెరువు కోసం కుటుంబంతో కొన్నాళ్ల కిందట సిద్దిపేటకు వచ్చారు. ఇక్కడ చిన్న పాటి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆయన తండ్రి దత్తయ్య(75) అనారోగ్యంతో బాధపడుతూ ఈనెల 11న సాయంత్రం మృతిచెందాడు. విషయం ఇంటి యజమానికి తెలియడంతో ఇంటి వద్ద మృతదేహం ఉంచేందుకు నిరాకరించారు. దీంతో 12వ తేదీన ఉదయాన్నే కుటుంబ సభ్యులతో సహా వైకుంఠధామం(శ్రీరామకుంట్ల శ్మశానవాటిక) బయల్దేరి అక్కడే అంత్యక్రియలు చేశారు. తిరిగి అద్దె ఇంటికి వెళ్దామనుకున్నా, యజమాని నుంచి సరైన స్పందన లేక వైకుంఠధామంలోనే తలదాచుకుంటున్నారు. వైకుంఠధామం వద్ద ఫ్రీజర్లు భద్రపరిచే ఓ షెట్టర్‌లో సంతోష్, అతడి భార్య, పదేండ్లలోపు ఇద్దరు కుమార్తెలు, తల్లి బిక్కుబిక్కుమంటూ ఉంటున్నారు. విషయం తెలుసుకున్న ఆర్యవైశ్య సంఘాలు బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. తాత్కాలికంగా నివాస సదుపాయం కల్పించాలని సంతోష్ విన్నవించారు.